www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 24 ఆగస్టు 2025
5
అన్నమయ్య





పాడైపోతున్న వైద్య కళాశాల భవన నిర్మాణాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు


చాపకింద నీరులా...!



జోరుగా గంజాయి అమ్మకాలు
మత్తుకు బానిసలవుతున్న విద్యార్థులు, యువత
విచ్చలవిడిగా గంజాయి సిగరెట్లు
పోలీసుల మొక్కుబడి దాడులు
ఆగని గంజాయి అక్రమ రవాణా, వ్యాపారాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మత్తుకి అలవాటు పడిన కొంతమంది యువతే లక్ష్యంగా జిల్లాలో గంజాయి అమ్మకాలు గుట్టుచప్పుడు కాక జోరుగా సాగుతున్నాయి. సిగరెట్లు, మద్యం తాగడం ఫ్యాషన్‌గా భావించిన కొందరు ఇప్పుడు గంజాయిని మత్తుగా ఎంజాయి చేస్తున్నారు. చదువుకున్న యువత సైతం వీటికి బానిసగా మారి బంగారు భవిష్యత్తును చిత్తు చేసుకుంటున్నారు. మదనపల్లె కేంద్రంగా గంజాయి వ్యాపారం జోరందుకుని చాపకింద నీరులా విస్తరిస్తోంది. గుట్టు చప్పుడు కాకుండా గంజాయి బ్యాచ్ రూ.లక్షల్లో వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో విద్యార్థులు, పేద, మధ్య తరగతి యువత మదనపల్లె కేంద్రంగా దొరికే గంజాయికి, గంజాయి సిగరెట్ల కోసం అలవాటు పడి బానిసలుగా మారుతున్నారు. ఇవి సులభంగా దొరుకుతుండడంతో యువత వాటిని తాగి మత్తులో తూలుతూ ఘర్షణలకు దిగడం, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడడం, దొంగతనాలకు అలవాటు పడుతూ జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారు. గంజాయి వాడుతున్న యువతలో అత్యధికులు ఉద్యోగులు, దళితుల కుటుంబాలకు చెందిన వారే కావడం గమనార్హం. మరి కొంతమంది గంజాయి మత్తులో అఘాయిత్యాలకు పాల్ప డుతున్న సంఘటనలూ ఉన్నాయి. ఇందుకు ఉదాహరణే చంద్రాకాలనీకి చెందిన ఓ విద్యార్థి స్కూల్ బ్యాగులో కొడవలి పెట్టుకుని పాఠశాలకు వచ్చి హల్‌చల్ చేశాడు. ఇదిలా ఉంటే గంజాయి వ్యాపారులు ఒకడుగు ముందుకు వేసి గంజాయి కావాల్సిన వారికి మొబైల్ ఫోన్లలో మాట్లాడుకుని డైరెక్టుగా కాలేజీలు, హాస్టళ్లు, పీజీల్లో గంజాయి, గంజాయితో తయారు చేసిన సిగరెట్లను సరఫరా చేస్తూ ఆర్థిక లబ్ధి పొందడమే కాకుండా మరో వైపు యువతను పాడు చేస్తున్నారు. ఇటీవల పోలీసులు పట్టణం, చుట్టు పక్కల ప్రాంతాల్లో దాడులు చేసి పదుల సంఖ్యలో గంజాయి వ్యాపారులతో పాటు గంజాయి తాగుతున్న యువతను అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నా పెద్దగా ప్రయోజనం కనిపించడం లేదు. ఇటీవల కాలంలో కోళ్లబైలు పంచాయతీలో 12 మంది గంజాయి వ్యాపారుల అరెస్టు చేసి వారి నుంచి లక్షల విలువ చేసే గంజాయి సిగరెట్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చాప కింద నీరులా సాగుతున్న ఈ వ్యాపారంతో కొందరు కోట్లు గడిస్తుండగా అభం శుభం తెలియని యువత డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా బంగారం లాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. గంజాయి వ్యాపారుల ధన దాహానికి విద్యార్థులతో పాటు యువతే కాకుండా రోజువారీ కూలిపనులకు వెళ్లే కార్మికులు, పేద, బడుగు జీవులు, బాధితులుగా మారుతు న్నారు. అంతే కాకుండా సామాన్యుల కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ముఖ్యంగా మదనపల్లె, నీరుగట్టువారిపల్లి, చంద్రాకాలనీ, లక్ష్మీనగర్, చేనేతనగర్, అమ్మచెరువుమిట్ట, గజ్జలకుంట, గౌతమినగర్, నక్కలకుంట, బసినికొండ, మోతినగర్, రామ్‌నగర్, సైదాపేట, ఇందిరానగర్, కురవంక, కొత్తఇండ్లు, ఈశ్వరమ్మ కాలనీ, సిటిఎం, మొలకలదిన్నె, తంబళ్లపల్లె నియో



జకవర్గంలో ప్రధానంగా ఇంజినీరింగ్ కాలేజీలు, పీజీలు ఉండే అంగళ్లు, కురబలకోట, సర్కార్‌తోపు, తదితర ప్రాంతాల్లో ప్రతిరోజూ లక్షల్లో గంజాయి వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించి విక్రయాలు

ఇతర రాష్ట్రమైనప ఒరిస్సా నుండి మన రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ జిల్లాల నుంచి గంజాయి, గంజాయి సిగరెట్లను అక్రమంగా తెచ్చి అమ్మేస్తున్నారు. గంజాయి స్మగ్లర్లు వీలైనంత వరకూ కొట్టేసిన బైకులు, ఇతర వాహనాలలో చీరలు, చిన్నపిల్లల ఆట వస్తువులు, నిత్యావసర సరుకుల్లో దాచి మదనపల్లెకు తీసుకువచ్చి తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

గంజాయి వ్యాపారి హత్య

వెస్ట్ బెంగాల్‌కు చెందిన యువకుడు ఖదీర్ మదనపల్లెలో గంజాయి వ్యాపారం చేస్తూ వివాదాల్లో చిక్కుకున్నాడు. బసినికొండకు చెందిన ఆసిఫ్, మౌలా వద్ద గంజాయి విక్రయిస్తానని ఖదీర్ రూ.50 వేలు తీసుకున్నాడు. అనుకున్న సమయానికి గంజాయి సరఫరా చేయలేకపోవడంతో ఖదీర్‌ను హత్యచేసి రైలు పట్టాలపై పడేశారు. మదనపల్లెలో యువత గంజాయి మత్తులో పడి పరస్పర దాడులకు తెగబడుతున్నారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. పోలీసులు గంజాయి వ్యాపారులపై ఉక్కు పాదం మోపి అణిచి వేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



గంజాయితో గొడవలు జరుగుతున్నాయి

గంజాయికి అలవాటు పడిన యువకులు మత్తులో గొడవ లకు పాల్పడుతున్నారు. అకారణంగా అమాయకులపై దాడులకు తెగబ డుతున్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోతుంది. చైన్ స్నాచిం గ్‌లకు, చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు అరికట్టాల్సి ఉంది.

- వీరభద్ర, స్థానికుడు, మదనపల్లె.

కుటుంబాల్లో కలవరపాటు



గంజాయికి అలవాటు పడడంతో బానిసలుగా మారిపోతున్నారు. గంజాయి కోసం ఎంతటి అగత్యాలకైనా పాల్పడుతున్నారు. కుటుంబాలు కలవరపాటు మొదలైంది. బిడ్డను ఎలా బాగు చేసుకోవాలో తెలియక తల్లిదండ్రులు తల్లడిల్లి పోతున్నారు. పోలీసులకు పట్టుబడి కటకటాల పాలై జీవితాన్ని అంధకారం చేసుకుంటున్నారు. గంజాయిపై ప్రభుత్వం నిఘా పెట్టి రూపుమాపాల్సిన అవసరం ఉంది.

- ఖదీర్ అహ్మద్, స్థానికుడు, మదనపల్లె.

అవగాహనతో గంజాయికి చెక్



ప్రభుత్వం కళాశాలు, పాఠశాలలతో పాటు పలు పబ్లిక్ ఏరియాలలో గంజాయి నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. గంజాయి వల్ల జరిగే దుష్పరిణామాలను తెలియజేస్తూ అప్రమత్తం చేయాల్సి ఉంది. బిడ్డలను తల్లిదండ్రులు గమనిస్తూ గంజాయికి అలవాటు పడినట్లు గుర్తిస్తే మొహమాట పడకుండా వెంటనే వైద్యులకు చూపించి చికిత్సలు చేయించాల్సిన అవసరం ఉంది. ఆలస్యం చేస్తే గంజాయికి బానిసలుగా మారి, చేయి దాటిపోయే ప్రమాదం ఉంది. అప్రమత్తంగా ఉండి సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది.

- డాక్టర్ రాధిక, ప్రభుత్వ ఆసుపత్రి సైకియాట్రిస్ట్, మదనపల్లె.

స్పెషల్ డ్రైవ్ ద్వారా గంజాయిని అరికడతాం



ఇటీవల కాలంలో రైలు మార్గం ద్వారా గంజాయి సరఫరా జరుగుతున్నట్లు తెలుస్తోంది. మారుమూల ప్రాంతాల్లో గంజాయి నిల్వ చేసి అక్రమంగా వ్యాపారాలు సాగిస్తున్నారని తమ దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలు గంజాయి కేసుల్లో పాల్గొన్న పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాం. పాఠశాలలు, కళాశాలల వద్ద మఫ్టీలో సిబ్బందిని నియమించి గంజాయి నిర్వాహకులపై దృష్టి సారిస్తాం. ప్రజలు పోలీసులకు సహకరించి గంజాయి సరఫరా, విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే మాకు సమాచారం అందించాలి. గంజాయిని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం.

- మహేంద్ర, డిఎస్‌పి, మదనపల్లె.



ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి (ఫైల్ ఫొటో)

వైద్య కళాశాలపై సర్కారు నిర్లక్ష్యం

- రూ.72 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం
- నిర్మాణాలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రాష్ట్రంలో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం శీతకన్ను సారించడంతో వేలకోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు, సిపిఎం నాయకులతో కలిసి మదనపల్లెలో నూతనంగా నిర్మాణం చేపట్టిన మెడికల్ కళాశాల ప్రాంగణాన్ని, నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2022లో వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటుకు మదనపల్లె, ఆదోని, మార్కాపురం, పులివెందులలో అగ్రిమెంట్ చేసుకుందన్నారు. 2023 కల్లా భవనాలను పూర్తి చేసి, 2024లో కళాశాలలను ప్రారంభించా లనుకున్నారన్నారు. మదనపల్లెలో రూ.472 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. పనులు ఆలస్యంగా జరగడంతో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రిలో 2025 నాటికి క్లాసులు ప్రారంభించాలన్న ఉద్దేశంతో రూ.12 కోట్లతో తాత్కాలిక భవనాలకు నిధులు మంజూరు చేశారన్నారు. ఈ తాత్కాలిక భవనాలకు కోసం రూ.7 కోట్లు ఖర్చు చేసినట్లు లెక్కలు చూపుతున్నారే కాని అందులో కనీసం కోటి రూపాయల పనులు కూడా జరగలేదన్న విషయం జరిగిన పనులను చూస్తే అర్థమవుతుందని విమర్శించారు. భవనాలు ప్రారంభం కాక మునుపే పూర్తిగా పాడైపోయాయని, కొద్దిపాటి వర్షానికే ఉరుస్తూ, కూలిపోయే స్థితికి చేరాయన్నారు. మరి ఈ ధనమంతా ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. గతంలో భవన నిర్మాణాలను మెగా కంపెనీకి కేటాయించగా కాలేజీ నిర్మాణ ప్రాంగణంలో రెండు హాస్టల్ భవనాలను ప్రారంభించారని, హాస్పిటల్ భవనాలు ఇంకా పూర్తి కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే పూర్తిగా నిర్మాణాలను ఆపేశారని, తాత్కాలిక భవనాల్లో ప్రారంభం కావాల్సిన మెడికల్ కాలేజీ ని ప్రారంభించలేదని పేర్కొన్నారు. నిర్మితమైన భవనాల పెచ్చులు ఊడిపోయే స్థితికి చేరడంతో పాటు కశాశాల నిర్మాణ ప్రదేశంలో రూ. 10 కోట్ల విలువైన వస్తు సామాగ్రి పాడైపోయి దుస్థితికి చేరాయన్నారు. ఈ డబ్బంతా ప్రజల మీద పడే భారం కాదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పి4 విధానాన్ని తీసుకొచ్చి ప్రజాధనం కొల్లగొట్టేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఇది దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మెడికల్ కాలేజ్ మంజూరు చేసిన రూ.472 కోట్లలో ఖర్చు పోనూ తక్కిన రూ.400 కోట్లను వెంటనే విడుదల చేసి మెడికల్ కాలేజ్ భవన నిర్మాణాలు పూర్తి చేసి 2026 లో కాలేజ్ ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సిపిఎం పార్టీతో కలిసి వచ్చే శక్తులను, రాజకీయ పార్టీలను, ప్రజాసంఘాలను ఏకం చేసి రాష్ట్ర స్థాయి ఆందోళనకు పిలుపునిస్తామన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని సర్వజన బోధనాస్పత్రిగా మార్పు చేయడంతో ఇక్కడి ప్రజలు ఎంతో సంతోషించారని పేర్కొన్నారు. మెరుగైన వైద్య సౌకర్యాలు అందుతాయని, అన్ని రకాల వైద్య సదుపాయాలు ఇక్కడే అందుబాటులో ఉంటాయని పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారన్నారు. 2025లో మెడికల్ కాలేజ్ ప్రారంభం కానున్న క్రమంలో ప్రొఫెసర్లు, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, వైద్య సిబ్బంది నియమింపబడ్డారు. రూ.12 కోట్లతో బిల్డింగ్ పనులు ప్రారంభించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే వీటన్నిటిని నిలుపుదల చేసి, వైద్యులను, వైద్య సిబ్బందిని తరలించి మదనపల్లె ప్రజల ఆశలపై నీళ్లు చల్లారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మెడికల్ కళాశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరుబాట తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరినాథ్ శర్మ, నాగరాజు, రామకృష్ణ, రామ్మూర్తి, శ్రీరాములు, రాజు, కృష్ణప్ప, అఫ్రిది, జయబాబు, సమీర్ పాల్గొన్నారు.

'ఆదిత్య'లో క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లె

పట్టణంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఎడబ్లుఎస్ క్లౌడ్ కంప్యూటింగ్ ఫండమెంటల్స్ నుంచి హ్యాండ్స్ఆన్ ప్రాక్టీసెస్ అనే అంశంపై శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమానికి బెంగళూరులోని ట్రయాంజ్ డిజిటల్ సర్వీసెస్ టెక్నికల్ లీడ్ డాక్టర్ వి.రహమతుల్లా ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. క్లౌడ్ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ టెక్నాలజీలలో ఆయనకు ఉన్నఅనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. క్లౌడ్ ఆర్కిటెక్చర్, సర్వీస్ మోడల్స్, డిప్లాయ్‌మెంట్ మోడల్స్, ఖర్చు తగ్గింపు వ్యూహాలపై ఆయన సవివరంగా మాట్లాడారు. హెల్త్‌కేర్, బ్యాంకింగ్, ఈ-కామర్స్, విద్య వంటి రంగాలలో క్లౌడ్ వినియోగం పెరుగుతున్న తీరు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రారంభోత్సవ కార్యక్రమానికి కళాశాల కరస్పాండెంట్ ఆర్. రామమోహన రెడ్డి, అధ్యక్షుడు ఎం.నాగమల్లా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

దారుణం

ప్రజాదృష్టి

ఉమ్మడి కడప జిల్లాలో వేర్వేరు ఘటనల్లో నలుగురు విద్యార్థులు మృతి చెందడం కలిచివేసింది. రాజంపేట అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబిఎ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు, వేంపల్లి ట్రిపుల్‌ఐటికి చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య పాల్పడిన ఉదంతాలు చర్చనీయాంశంగా మారాయి. అన్న మాచార్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సరదా కోసం చెయ్యేరులోకి ఈతకు వెళ్లగా ముగ్గురు జలసమాధి కావడం తల్లిదండ్రులను కన్నీటిపర్యంతం చేసింది. ట్రిపుల్‌ఐటి విద్యార్థి ఆత్మహత్యకు కారణమేమిటో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదేమైనా నలుగురు విద్యార్థులు రెండు వేర్వేరు ఘటనల్లో ఉన్న ఫళంగా మృత్యు వాత పడడం సమాజాన్ని ఉలిక్కిపడేలా చేసింది. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు. చేతికి అందేలోపు మృత్యువు కభళించడం భరించలేని దు:ఖాన్ని కలిగిస్తోంది. ప్రతిఏటా జిల్లాలో ఏదోఒక చోట సరదా కోసం ఈతకు వెళ్లి పలువురు మృత్యువాత పడడం పరిపాటిగా మారింది. అన్నమయ్య జిల్లాలోని చెయ్యేరు, వల్లూరు మండల పరిధిలోని పుష్పగిరిక్షేత్రం దిగువ గల పరీవాహక ప్రాంతంలో, దువ్వూరు, బిమఠం పరిధిలోని తెలుగుగంగ కాల్వల సమీపంలోని పరీవాహక ప్రాంతాల్లోకి దిగిన యువకులు సుడిగుండాల బారిన పడి మృతి చెందుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. చెయ్యేరు పరీ వాహక ప్రాంతంలో బావుల తరహాలో ఇసుక గుంతలు తవ్వడం, పుష్పగిరి పుణ్య క్షేత్రం సమీపంలోని పరీవాహక ప్రాంతంలో ఏర్పడిన గుంతల్లో సుడిగుండాలు, తెలుగుగంగ కాల్వల ప్రవాహంలో పడి పలువురు మృత్యువాత పడుతున్న సంగతి తెలిసిందే. మరణాల నివారణకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం, ప్రమా దకర ప్రాంతాల్లోకి దిగకుండా భద్రతా ఏర్పాట్లు చేయడం ద్వారా మరణాలను నివారించే ప్రయత్నం చేయచ్చనే వాదన వినిపిస్తోంది. గురువారం ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో అంగన్వాడీలకు గ్రాట్యుటీ చెల్లింపు నిర్ణయం తీసుకోవడం స్వల్పఊరటను కలిగించింది. టిడిపి అధ్యక్షుని హోదాలో 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నెరవే ర్చుతూ నిర్ణయం తీసుకోవడం హర్షనీయం. 62 ఏళ్లు నిండిన అనంతరం అంగ న్వాడీలకు రూ.లక్ష, హెల్పర్లకు రూ.40 వేలు గ్రాట్యుటీ ఇస్తామని, మిగిలిన వారిని గాలికి వదిలేస్తూ షరతులు పెట్టడం నిరాశను కలిగించింది. ఇంతటి సుధీర్ఘకాలం ఎవరు పని చేసే వాళ్లు అతి స్వల్ప సంఖ్యలో ఉంటారని అంగన్వాడీ యూనియన్ల నుంచి వినిపిస్తోంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీలకు తొలగింపు బెది రింపుల నేపథ్యం కొనసాగుతున్న నేపథ్యంలో గ్రాట్యుటీ చెల్లింపు నిర్ణయం పట్ల ఆశిం చిన స్పందన కనిపించని పరిస్థితి కనిపిస్తోంది.ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఉభయ జిల్లాకు చెందిన సుమారు తొమ్మిది నుంచి 12 వేల మంది అంగన్వాడీలకు గ్రాట్యుటీ సదుపాయాన్ని వర్తింపజేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి : కలెక్టర్



మురుగునీటిలో మెలాథిన్‌ను పిచకారి చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- కలకడ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పిలుపునిచ్చారు. శనివారం కలకడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పరిశుభ్రత పట్ల మరింత చైతన్యం కలిగి స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. వర్షాకాలంలో పాటించాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. జూలై చివరి వారం నుంచి జిల్లాలో వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉంటే దోమలు, ఇతర కీటకాలు విస్తరించి మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు, అంటువ్యాధులను నివారించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావడం అత్యవసరమన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి ఎక్కడా నీరు నిల్వ లేకుండా పరిశుభ్రతను పాటించాలని సూచించారు. సచివాలయాలు, పంచాయితీలు, మున్సిపాలిటీల పారిశుధ్య సిబ్బందితో పాటు ప్రజలందరూ కలసికట్టుగా కృషి చేయాలని ఆదేశించారు. ప్రతినెలా చేపడుతున్న ఘన, ద్రవ వ్యర్థాల సమర్థవంతమైన నిర్వహణతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట మానవహారం చేపట్టి ప్రజలందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దయాకర్‌రెడ్డి తహశీల్దార్ మహేశ్వరి బాయ్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కేసి జగదీశ్వర్,.డిప్యూటీ ఎంపిడిఒ ప్రతాపరెడ్డి, ఎంఇఒ మునీంద్ర నాయక్, మండల స్థాయి అధికారులు, వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెరగాలి

ప్రజాశక్తి-రాయచోటి

అంతరిక్ష పరిశోధనలో అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా భారత్ ఎదగడం భారతీయులందరికీ గర్వకారణమని డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఉదయం డైట్ ప్రాంగణంలో డిపార్ట్మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023 ఆగస్టు 23న భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3లోని విక్రమ్ ల్యాండర్ సురక్షితంగా దిగిందన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా నిర్ణయించిందన్నారు. ఈ యేడు ఆర్యభట్ట నుండి గగన్యాన్ వరకు ప్రాచీన జ్ఞానం నుంచి అనంతమైన అవకాశాలు అనే ఇతివృత్తంతో అంతరిక్ష దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించుకొంటున్నామన్నారు.ఈ దినోత్సవం విద్యార్థులతో పాటు ప్రతి ఒక్కరికి అంతరిక్ష పరిశోధన ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించు కోవడానికి దోహద పడడమే కాకుండా భవిష్యత్తు తరాలకు ప్రేరణ ప్రేరణ ఇస్తుందన్నారు. అంతరిక్ష ప్రయోగాల పట్ల పిల్లలు, యువతలో ఆసక్తి పెంపొందించడానికి, విద్యార్థులను ప్రోత్సాహించేందుకు ఇస్రో 'యువిక(యుంగ్ సైంటిస్ట్)-2025'అనే కార్యక్రమం నిర్వహిస్తోందని, దానిని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఈ దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వకృత్వ, పోస్టర్ల తయారీ పోటీల లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు శివ భాస్కర్, వై సి రెడ్డప్ప రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, గిరిబాబు యాదవ్, శివప్రసాద్, తిరుపతి శ్రీనివాస్, కేదార్నాథ్, మోహన్ నాయక్, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్త కొరత లేకుండా చూస్తాం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో రోగులకు అవసరమైన రక్తాన్ని కొరత లేకుండా అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీధర్‌చామకూరి తెలిపారు. శనివారం కలెక్టరేట్ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు అవసరమైన రక్తాన్ని అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుం టామన్నారు. మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో కేవలం 10 యూనిట్ల రక్తం మాత్రమే అందుబాటులో ఉందని తెలిసిన వెంటనే రెవెన్యూ అసోసియేషన్ స్పందించి కనీసం 200యూనిట్ల రక్తాన్ని ఉచితంగా అందించేందుకు ముందుకు రావడాన్ని కలెక్టర్ అభినందించారు. భవిష్యత్తులో పంచాయతీరాజ్, ఇతర ప్రభుత్వ విభాగాలు, విద్యా సంస్థలు, ఇంజినీరింగ్ కాలేజీల నుంచి యువతను కూడా రక్తదాన శిబిరాల్లో పాల్గొనేలా ఆహ్వానిస్తామని కలెక్టర్ తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పర్యవేక్షించి, అవసరమైన పండ్లు, జ్యూస్ అందజేస్తూ సురక్షితంగా రక్త సేకరణ చేపట్టాలని సూచించారు. పేద రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా రక్తాన్ని అందించడంలో ఇది ఎంతో ఉపయో గకరమన్నారు. రక్తదానం చేసినవారికి రెవెన్యూ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెసి ఆదర్శ్‌రాజేంద్రన్, రాజంపేట సబ్‌కలెక్టర్ హెచ్.ఎస్.భావన, డిఆర్‌ఒ మధుసూదన్‌రావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ కుమార్, తహశీల్దార్ నరసింహకుమార్ పాల్గొన్నారు. అనంతరం జెసి ఆదర్శ్ రాజేంద్రన్, రాజంపేట సబ్ కలెక్టర్ భావన రక్తదానం చేశారు. రక్తదానం చేసిన అనంతరం కలెక్టర్, జెసి పండ్లు పంపిణీ చేయగా, రాజంపేట సబ్ కలెక్టర్‌కు మదనపల్లి సబ్ కలెక్టర్ కళ్యాణి జ్యూస్ అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్‌కుమార్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మూడవ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పౌరహక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంటరానితనాన్ని పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. తప్పుడు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను ప్రోత్సహించకూడదని హెచ్చరించారు. తక్కువ కులాల వారిని చిన్నచూపు చూడకూడదని, కులాలకు అతీతంగా మెలగాలని సూచించారు. మానవజాతి అంతా ఒకటేనన్న భావనతో భారతీయ పౌరులుగా ఈ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తప్పుడు కేసులు పెట్టడం వలన పలు సెక్షన్ల కింద శిక్షార్హులవుతారని, కులాల పేరుతో కించపరచకూడదని, ప్రతి ఒక్కరిని ప్రేమతో, గౌరవంతో చూడాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఇన్సూరెన్స్ కలిగిన వాహనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్రతి విద్యార్థి గ్రూప్స్, సివిల్స్‌పై పట్టు సాధించి ఉద్యోగాలు సాధించాలని కోరారు. ఏ.ఎస్.పి మనోజ్ రామ్నాథ్ హెగ్డే మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, పోస్కో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ అధికారి హైమావతి, బార్ అధ్యక్షులు హనుమంతు నాయుడు, పట్టణ ఎస్.ఐ వెంకటేష్, కళాశాల ప్రిన్సిపల్ పురుషోత్తం మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి-రాయచోటి: ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థినిలకు స్కాలర్‌షిప్, ప్రశంసా పత్రాలను కలెక్టర్ శ్రీధర్ చామకూరి, జెసి ఆదర్శరాజేంద్రన్ చేతులమీదుగా అందించారు.శనివారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో క్రెడిట్ యాక్సెస్ ఇండియన్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదివి అత్యధిక మార్కులతో ఉత్తీర్ణులైన ప్రతిభావంతులైన 8 మంది విద్యార్థినిలకు ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున కలెక్టర్ శ్రీధర్ చామకూరి విద్యార్థినిలకు అభినందిస్తూ స్కాలర్‌షిప్, ప్రశంసాపత్రాలను అందించారు. 10వ తరగతిలో ప్రతిభ చూపిన ఎ.పూజిత, పి.తేజస్విని, ఇ.భావ్యశ్రీ, బి. రెడ్డిరాణి, ఎస్.సాదిక, పి.పల్లవి స్కాలర్‌షిప్‌లను అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ తరపున డివిజనల్ మేనేజర్ ఎం. జగదీష్, ఏరియా మేనేజర్ హను మంతయ్య, సుంకన్న, బ్రాంచ్ మేనేజర్ మధు సుధన్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వీధి దీపాలను పరిశీలిస్తున్న సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి-పుల్లంపేట

మౌలిక వసతుల కల్పనే తన లక్ష్యమని పుల్లంపేట సర్పంచ్ ఆకేపాటి.శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. శనివారం పుల్లంపేట గ్రామపంచాయతీలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా వీధిలైట్లు , చెత్త దిబ్బలు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులతో పాటు ప్రతి వీధిలో అవసంమైన చోట కొత్త లైట్లును ఏర్పాటు చేశారు. ఈ విధులలో విద్యుద్దీపాల సమస్య తన దృష్టికి రావడంతో వెంటనే మరమ్మతులతో పాటు కొత్త విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని వీధిలైట్లు లేకపోవడం వలన ప్రజలు విషపురుగుల బారిన పడటం తో పాటు దొంగలు బెడద కూడా ఉంటుందని అన్నారు. గ్రామపంచాయతీలో ఎటువంటి సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించి పంచాయితీని అబి.వృద్ధి బాటలో నడిపించేందుకు అన్ని విధాల కృషి చేయడం జరుగుతోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జయశ్రీ, ఇఒపిఆర్‌డి ముత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వీకుల ఆస్తి కబ్జాకు నకిలీ పత్రాల సృష్టి

- అధికారులు న్యాయం చేయాలని బాధితుడి వేడుకోలు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

పూర్వీకుల నుంచి తమకు సంక్రమించిన ఆస్తిని కొందరు నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేయాలని చూస్తున్నారని, తమకు అధికారులు న్యాయం చేసి ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరుగట్టువారి పల్లెకు చెందిన బాధితులు మంజునాథ్, శ్రీనివాసులు, నారాయణ, వెంకటరెడ్డి, అలివేలమ్మ మాట్లాడుతూ మా తాత మొండి గంగన్నకు కోళ్లబైలు పంచాయితీలో1966 లో సర్వే నెంబర్ 605/6 లో 2.88 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం పట్టా ఇచ్చిందన్నారు. మా తాత కాలం నాటి నుంచి ఇప్పటివరకు తమకు వారసత్వంగా వచ్చిన ఆ స్థలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. స్థానికంగా ఉన్న మురళి అనే వ్యక్తి మిలిటరీ పట్టా అంటూ నకలీ పత్రాలు సృష్టించి, సర్వే నెంబర్లు మార్చి, రిజిస్టర్ అయ్యిందంటూ బుకాయిస్తూ మా భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని తాము ఇప్పటికే రెవెన్యూ అధికారులకు, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అధికారులు పత్రాలను పరిశీలించి, వారసత్వంగా వస్తున్న మా భూమి మాకు దక్కేలా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. నకిలీ పట్టాలు సృష్టించిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

శ్రీశైలం ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

శ్రీశైలం రేంజ్ పరిధిలో అటవీశాఖ సిబ్బందిపై జరిగిన భౌతిక దాడులకు నిరసనగా అన్నమయ్య డివిజన్ రాయచోటి రేంజ్ అటవీ శాఖ సిబ్బంది సామూహిక నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీశైలం రేంజ్ పరిధిలో అటవీశాఖ సిబ్బందిపై జరిగిన శ్రీశైలం ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి అతని అనుచరులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు

కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని టి.కమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఆర్. రామకృష్ణయ్య కంప్యూటర్‌ను ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో హెచ్ఎం శిబతుల్లా మాట్లాడుతూ రామకృష్ణయ్య మా పాఠశాల కు కంప్యూటర్ ను అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామపెద్ద కాపేర్ల చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ రామకృష్ణయ్య ఉపాధ్యాయుడిగా ఎన్నో సంవత్సరాలు విద్యార్థులకు సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసి కూడా విద్యార్థుల కొరకు ఆలోచిస్తుండడం గొప్ప విషయమని అన్నారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్‌ను ఖాళీ సమయాల్లో ప్రాక్టీస్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్, బాల నరసింహులు, శిపాల మహేష్,ఆసిఫ్ భాష, గిరిధర్, బుజ్జి బాబు తాయారమ్మ పాల్గొన్నారు.

22 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపల్లె ఆధ్వర్యంలో స్థానిక సొసైటీ కాలనీలోని యలన్స్ ఐ ఆస్పత్రిలో శనివారం 22 మందికి కంటిశుక్లం ఉచిత శస్త్ర చికిత్సలను పూర్తిచేయడం జసరిగిందని లయిన్స్ క్లబ్ ఎంజెఎఫ్ లయన్ గౌతమ్ రెడ్డి, లయన్ డాక్టర్ నివేదిత, జడ్.సి లయన్ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. ఈ సందర్భంగా కంటి ఆపరేషన్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మందులు అందజేసి, జాగ్రత్తలు చెప్పి వారిని ఇళ్లకు పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అందత్వాన్ని నివారించడం కోసం శాశ్వత ప్రాజెక్టుగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు లయన్స్ కంటి ఆసుపత్రి నందు 25 వేల మందికి ఉచిత ఆపరేషన్లు చేయడమే కాకుండా, లక్ష మందికిపైగా స్క్రీనింగ్ చేశామని వెల్లడించారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా ముందుకు సాగుతుందని, దృష్టి లోపాలు ఉన్నవారు లయన్స్ కంటి ఆసుపత్రిలో సంప్రదించి ఉచిత కంటి చికిత్సలు పొందాలని తెలిపారు.

డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడ చెరువు బండ వీధిలో చాలా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. శనివారం స్థానిక ప్రజలు టానా మొహద్దీన్ సాబ్ కుమారులు చాన్ బాషా, జిలాని భాష, సాబ్జాన్ కుమారుడు సయ్యద్‌బాషా, అల్లి సాబ్ కుమారులు షాబాద్‌భాషా, రఫీ స్థానిక ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కెసి.జగదీశ్వర్‌ను కలిసి డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని వినతి సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ బజారు తాము 40 సంవత్సరములుగా కాపురాలు ఉంటూ ప్రభుత్వం వారిచే మా ఇండ్లకు పట్టాలు సైతం పొందామని పేర్కొన్నట్లు తెలిపారు. కొంతమంది మాపై కక్ష సాధింపు చర్యలు చేపడుతూ మురుగు కావల్లో వర్షపు నీరు పోకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. వర్షం వస్తే మురుగునీరంతా ఇళ్లలో వచ్చి చేరుతుందని తెలిపారు. గతంలో ఉన్న అధికారులకు ఎన్నోసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం కొద్దిపాటి వర్షం పడిన మురికి నీరు, వర్షపు నీరు మా ఇళ్ళలోకి చేరి దుర్గంధ భరితంగా మారి, రోగాలు బారిన పడుతూ, ఇళ్లలో ఉండేందుకు కూడా ఇబ్బంది పడుతున్నట్లు వారు పేర్కొన్నట్టు తెలిపారు.స్థానిక ఎంపిడిఒ, పంచాయతీ, కార్యదర్శి స్పందించి మా కాలనీని సందర్శించి ఇరువైపులా మరుగునీరు, వర్షపు నీరు పోయేందుకు డ్రెయినేజీ కాలువలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మాట్లాడుతూ చెరువు బండ వీధిలో ఉన్న బజారును పరిశీలించి, అక్కడ సమస్యను తెలుసుకుని ప్రజలతో మాట్లాడి మురికి నీరు, వర్షం నీరు ఇండ్లలోకి రాకుండా చర్యలు చేపడతామని తెలిపారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆజిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, అన్నమయ్య జిల్లా, ఐసిటిసి ఆధ్వర్యంలో క్రుషి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్‌పై అవగాహన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐటిటిసి కౌన్సిలర్ చంద్ర మోహన్, ఎల్.టి. బాలాజీ, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ అంటే ఏమిని, మార్గాలు ద్వారా వస్తుందో వివరించి చెప్పారు. ఒఆర్‌డబ్ల్యూ పల్లవి మాట్లాడుతూ హెచ్ఐవి, ఎయిడ్స్ గురించి అవి రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులను ఆదరించాలని, పట్ల వివక్ష చూపరాదన్నారు.జీవిత భాగస్వామితోనే లైంగిక సంబంధం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సురేంద్ర, చౌడప్ప, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టంగుటూరి' జీవితం ఆదర్శనీయం : డిఆర్ఒ

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అడుగుజాడలు అందరికీ ఆదర్శం కావాలని డిఆర్ఒ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జన్మదిన వేడుకలను రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్ఒ టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో తన చొక్కా చించి ధైర్యంగా రొమ్ము చూపించి ధైర్యముంటే కాల్చుమని బ్రిటిష్ పోలీసులకు సవాలు చేసిన ధీశాలి అని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రజాసేవలో తన జీవితాన్ని దార పోసిన మహనీయుడు అన్నారు.ఒక మారుమూల గ్రామం నుండి చదువుకొని న్యాయవాది వృత్తి చేపట్టి, అనంతరం స్వరాజ్యం అనే దినపత్రిక తెలుగు తమిళ సంచికలలో ప్రజలకు సమాచారాన్ని చేరవేసేందుకు కృషిచేసి, మద్రాసులో సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పాల్గొని తుపాకి గుండుకు తన గుండెను ఎదురొడ్డి స్వేచ్ఛా స్వతంత్రాల కోసం గర్జించి, జగతిని జాగృతం చేసి యువతలో స్వాతంత్ర ఉద్యమకాంక్షను రగిలించిన త్యాగధనులు ఆంధ్ర కేసరి అనే బిరుదునిచ్చి గౌరవించిన టంగుటూరి ప్రకాశం పంతులుగారి జయంతి జరుపుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఒ, కలెక్టరేట్ సెక్షన్ ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్ నరసింహకుమార్, కలెక్టర్ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు 1జయంతి నిర్వహించారు. కళాశాల ఇంచార్జ్ అసోసియేట్ డీన్ డాక్టర్ సయ్యద్‌సదరున్నీషా టంగుటూరి చిత్రపటా నికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఒఎస్ఎ డాక్టర్ ముకుందలక్ష్మి, పీజీ ఒఎస్ఎం డాక్టర్ కే.లలిత, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ హరిమల్లికార్జునరెడ్డి, డాక్టర్ నిశ్చల, డాక్టర్ శ్రీలత, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.



టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్ఒ మధుసూదన్‌రావు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలం



రాయచోటి: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజలు, ఉద్యోగులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఎంపిడిఒ రమేష్‌బాబు పేర్కొన్నారు. శనివారం స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని రెడ్డివారిపల్లె, ముష్టూరు, నిమ్మనపల్లె గ్రామాలలో డిప్యూటీ ఎంపిడిఒ బాలరాజుతో కలిసి పర్యటించి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణను చేయించారు. మురుగునీటి కాలువలను పారిశుధ్య కార్మికుల చేత శుభ్రం చేయించారు. పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు వారి పరిధిలోని ఓ పల్లెకు వెళ్లి ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈ ప్రక్రియను ఫోటో తీసి ఆన్ లైన్ లో పొందుపరచాలన్నారు. చప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శులు పరిసరాల పరిశుభ్రత పై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిశుభ్రతపై తమకు ఫిర్యాదులు అందితే సంబంధించిన అధికారులపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **సుండుపల్లి :** మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో స్థానిక జడ్‌పి హైస్కూల్ ప్రాంగణంలో ఎంఇఒ రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. మపాఠశాలల్లోనే ఇంకుడు గుంతలను దోమలు రాకుండా నివారించుటకు కిరోసిన్ కూడా వేయడం జరిగిందని తెలిపారు. పాఠశాల కమిటీ చైర్మన్ గౌస్‌భాష దోమల నివారణకు ఇంకుడు ఏర్పాటు చేసి పారిశుధ్య చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రాయచోటి అర్బన్ :** పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరి అని జిల్లా గిరిజన ప్రత్యేక అధికారిణి తేజశ్విని అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ కమిషనర్ రవి, మెప్మా పట్టణ అధికారి అబ్బాస్‌అలీల ఆధ్వర్యంలో రాయచోటి పట్టణంలో ర్యాలీ జరిగింది. జెండా ఊపి ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పలవార్డులలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టామన్నారు. నంతరం ర్యాలీ మున్సిపల్ కార్యాలయం వద్దనుండి బస్టాండు కూడలిమీదుగా నేతాజి సర్కిల్ వరకు సాగింది. అక్కడ మున్సిపల్, మెప్మా అధికారులు, సచి వాలయం అధికారులు, సిబ్బందిలు విద్యార్థులతో కలసి మానవహారంగా ఏర్పడి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ఉద్దేశ్యంపై ప్రతిజ్ఞ చేశారు. వినాయకచవితి పండుగను పురస్కరించుకుని వివిధ రకాల రసాయనాల ద్వారా తయారుచేసిన వినాయక విగ్రహాలను కాకుండా మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. **వాల్మీకిపురం:** ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామంలో రోడ్డు ముళ్లపొదలతో అస్థవ్యస్థంగా తయారు కావడంతో పంచాయతీ అధికారులు స్పందించారు. మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ, జోగినాయనిపల్లిలో సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, సెక్రటరీ రెడ్డిశేఖర్ రెడ్డిలు జెసిబి సహాయంతో రోడ్డుపై ఉన్న ముళ్లపొదలు, పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా సెక్రటరీ రెడ్డిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి ప్రతి రోజు ఉదయం గ్రీన్ అంబాసిడర్లకు అందజేయాలన్నారు. అనంతరం తడిచెత్త, పొడి చెత్త ద్వారా వచ్చే ఆదాయాలపై ప్రజలకు వివరించారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



కలికిరి : రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి-కలికిరి

వ్యవసాయ, రెవెన్యూ విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా మండలం లోని సి.వి.భాస్కర్ రెడ్డి అండ్ సన్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు ఎరువుల దుకాణంలో యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్ ను, బిల్లులను పరిశీలించారు. దుకాణంలో అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలకు సంబంధించిన బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సిఐఎన్ నారాయణ, తహశీల్దార్ హరికుమార్, మండల వ్యవసాయాధికారి ఎం.హేమలత, కానిస్టేబుల్ గిరి పాల్గొన్నారు. **నందలూరు :** జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా మండలంలో నడుపుతున్నటువంటి ఎరువులు, పురుగుమందుల దుకాణాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేయడం జరిగిందని డిప్యూటీ తహశీల్దార్ మోహన్ కృష్ణ, మండల వ్యవసాయ అధికారి మల్లికార్జున పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూరియాను నిర్దేశిత ధరల్లోనే అమ్మాలని డీలర్లకు సూచించినట్లు తెలిపారు. ఎరువుల అమ్మకంలో డీలర్లకు తగు సూచనలు అందజేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో రెవిన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :** పట్టణంలోని ఎరువులు పురుగుమందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఎరువులను నిర్ణయించిన ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని ఆదేశించారు.జిల్లాలో యూరియా తగినంత స్టాక్స్ అందుబాటులో ఉన్నాయని, కొత్త స్టాక్స్ కూడా వస్తున్నాయని ఎఫ్ఆర్ఒ ,విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జె.మురళీకృష్ణ తెలిపారు.యూరియా లభ్యత గురించి రైతులు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎడిఎ సుబ్రమణ్యం, వ్యవసాయశాఖ అధికారి సందీప్, రైల్వేకోడూరు, హార్టికల్చర్ ఆఫీసర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ:** ఎరువుల దుకాణములను విజిలెన్స్ సిఐ నారాయణ ఆకస్మికతనికే నిర్వహించినట్లు తెలిపారు. మండల కేంద్రమైన కలకడలోని ఎరువుల దుకాణములను తనిఖీలు నిర్వహించి అందులో ఉన్న రికార్డులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలని తెలిపారు. ప్రభుత్వ నిర్ణీత ధరలు కాకుండా అదనంగా ఎరువులను అమ్మకాలు చేస్తే వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, దుకాణములను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఎరువుల దుకాణములలో ఉన్న సరుకును రిజిస్టర్ లో ఉన్న సరుకు సరిపోయినట్లు నిర్ధారించినట్లు తెలిపారు. కలకడలో ఉన్న గ్రోమోర్ ,పుడమి కిసాన్ మోర్స్, జై కిసాన్, తదితర ఎరువుల దుకాణములను తనిఖీలు చేసినట్టు తెలిపారు.కార్యక్రమంలో తహశీల్దార్ మహేశ్వరిబాయి, వ్యవసాయ అధికారి శ్రీనివాస్, విఆర్ఒ అనంతరాజు, సిబ్బంది అమృత కుమార్ రెడ్డి, ఎరువుల దుకాణముల యజమానులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **ములకలచెరువు :** మండలంలోని ఎరువుల దుకాణాలదారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించిన, ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయించిస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ప్రదీప్, ఎఒ స్రవంతి సూచించారు. ములకలచెరువులో వారు ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. అనంతరం దకాణంలో ఎరువుల నాణ్యతతో పాటు స్టాక్ వివరాలు, బిల్లులను పరిశీలించారు. ఎరువులు కొన్న రైతులకు బిల్లులు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేని మందులు, పరిమితి చెందిన మందులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో విఆర్ఒ, సిబ్బంది ఉన్నారు.



కలకడలో ఎరువుల దుకాణములను తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు



మాట్లాడుతున్న జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్

సైబర్ చట్టంపై అవగాహన ముఖ్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

న్యాయవాదులు సైబర్ చట్టం, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎపి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ డాక్టర్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ తెలిపారు. శనివారం మదనపల్లె బార్ అసోసియేషన్ కార్యాలయంలో సైబర్‌చట్టం, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్‌పై వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జస్టిస్ వి.రాధాకృష్ణ కృపాసాగర్ మాట్లాడుతూ న్యాయమూర్తులు, న్యాయవాదులు ప్రస్తుతం పెచ్చుమీరిన సైబర్ నేరాలను నిరూపించే క్రమంలో సైబర్ చట్టం, ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకు తగ్గ పలు సెక్షన్ల ను పూర్తి అవగతం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. వాటి అవగాహన అవసరమైన కొన్ని ప్రాముఖ్యమైన అంశాలను వివరించారు. అనంతరం బార్ అసోసి యేషన్ సభ్యులు జస్టిస్ డాక్టర్ రాధాకృష్ణ కృపాసాగర్ ను పూలమాల, దుశ్శా లువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసి డెంట్ అమర్నాథ్ రెడ్డి, జనరల్ సెక్రటరీ మనోహర్, జాయింట్ సెక్రటరీ సోమశేఖర్, 2వఅదనపు జిల్లా జడ్జి సూర్యనారాయణమూర్తి, న్యాయ మూర్తులు శ్రీలత,సుభాన్,శిరీష, కీర్తన, బార్‌అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

ప్రజాశక్తి - నందలూరు : మండలంలోని వివిధ ప్రాంతాల్లో వేసిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు, స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన 134జిఒ ప్రకారం ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడప పట్టణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సిటి. కృష్ణసింగ్ తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, అనధికార లే అవుట్ల యజమాను లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 30వ తేదీ లోపు అనధికార వెంచర్లు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ జరిగిన స్థల యజమానులు మాత్రమే అర్హులుగా ఉంటారన్నారు. 90 రోజుల్లోపు లైసెన్స్ కలిగిన ప్లానర్స్ లేదా వ్యక్తిగతంగా ఆన్లైన్లో దరఖాస్తు నమోదుకు గడువు ఉందన్నారు. అనంతరం అనధికార లేఔట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ ఇందు, ప్లానింగ్ సెక్రటరీ మునయ్య, పంచాయితీ సెక్రటరీలు శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె : అంగళ్లు సమీపంలోని మిట్స్ డీమ్డ్ టుబి యూనివర్సిటీలో బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం ఇండక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ప్రత్యేక స్ఫూర్తిదాయక కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ నిపుణుడు శ్రీరామమూర్తి విద్యార్థులకు పలు సూచనలు సహాలు అందించారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను ఎంచుకోవాలని సూచించారు. ఒత్తిడి నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకత్వం వంటి అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. వ్యక్తిగత జీవితంలో సమతుల్యతను కాపాడుకోవడానికి ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవాలని సూచించారు. నిజజీవిత ఉదాహరణలు, ఇంటరాక్టివ్ చర్చలతో విద్యార్థుల్లో సానుకూల ఆలోచన, స్వీయ క్రమశిక్షణ, స్థితిస్థాపకత పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు సమయ నిర్వహణ, లక్ష్యాల స్పష్టత, ఆత్మవిశ్వాసం పై దృష్టి పెట్టాలని సూచిస్తూ, సత్వరమార్గాల కంటే స్థిరమైన కృషి ద్వారా విజయం సాధించవచ్చని వివరించారు.



బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

బాల్య వివాహానికి అడ్డుకట్ట

- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం ముడుంపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాదరవల్లి మైనార్టీ తీరని ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న తన కూతురికి రాయవరం గ్రామం కస్పాకు చెందిన షేక్ సుహేల్ ఆదివారం వివాహం చేయాలని నిశ్చయించారు. వివాహ విషయంపై గుర్తు తెలియని వారు 1098కి ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు, ఐసిడిఎస్ సిబ్బంది, గ్రామపంచాయతీ సెక్రటరీ డిసిపియు వివాహాన్ని నిలిపి వేశారు. స్థానిక ఎస్ఐ శ్రీనివాస బాలిక తల్లిదండ్రులకు బాల్యవాహం చేయడం వలన కలిగే అనర్థాలపై వివరించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆడవారికి 18 సంవత్సరాలు నిండిన తరువాయి, పురుషులకు 21 సంవత్సరాలు పూర్తయిన తర్వాత వివాహం చేయాలని సూచించారు. మైనర్లకు వివాహం జరిపితే రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.లక్ష జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. వివాహానికి హాజరైన వారి బంధువులపై కూడా కేసు నమోదు చేస్తారని తెలిపారు. అనంతరం బాలిక తల్లిదండ్రుల నుంచి, పెద్దల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. కార్యక్రమంలో డిసిపియు లీగల్ అడ్వైజర్ కైరున్, పిఒఐసి రామలక్ష్మి, శైలజ, మహిళా పోలీస్ అనిత, అంగన్వాడి సూపర్వైజర్ సుశీల రెడ్డమ్మ, ఓబులమ్మ సమతా ఎన్‌జిఒ ప్రతినిధి ఎస్.వెంకటయ్య పాల్గొన్నారు.

టిడిపి జిల్లా అధ్యక్ష పదవి వడ్డెరలకు ఇవ్వాలి

ప్రజాశక్తి- రాయచోటి అర్బన్

అన్నమయ్య జిల్లా టిడిపి అధ్యక్ష పదవి వడ్డెరలకు ఇవ్వాలని రాష్ట్ర ప్రజాగళం అధ్యక్షుడు ఇడగొట్టు నాగేశ్వరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటివరకు జిల్లా టిడిపి అధ్యక్షులుగా ఉన్న జగన్‌మోహన్‌రాజు రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఎంపికయ్యారన్నారు.జిల్లా టిడిపి అధ్యక్ష పదవికి మార్పు తప్పనిసరి అయిందన్నారు. జిల్లా టిడిపి అధ్యక్షపదవిని రాష్ట్రంలో దాదాపు 40 లక్షల ఓట్లు కలిగిన వడ్డెరలకు కేటాయించాలన్నారు. జిల్లాలో రెండు లక్షల పైచిలుకు వడ్డెర జనాభా ఉన్నారన్నారు. తమకు టిడిపి ప్రభుత్వం ఎలాంటి నామినేటెడ్, పార్టీ పదవుల్లో సైతం స్థానం కల్పించకపోవడం దారుణమన్నారు. వడ్డెరలు అధికంగా ఉన్న జిల్లాల్లో వడ్డెరలకు జిల్లాపార్టీ అధ్యక్షులుగా, ఎంపీ, ఎమ్మెల్యే స్థానాల్లో సముచిత స్థానాన్ని కల్పించాలంటూ కోరారు.

'సురవరం' మృతి బాధాకరం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిపిఐ అగ్ర నాయకులు సురవరం సుధాకర్ రెడ్డి మృతి పట్ల వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాం త్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. విద్యార్థి ఉద్యమాలతో ఆయన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన గొప్ప నేత అని అన్నారు. సిపిఐ అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా, పార్లమెంటు సభ్యుడిగా పలు బాధ్య తలు నిర్వహించారని వామపక్ష ఐక్యతకు కృషి చేశారని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర రాజకీయాలలో కీలక పాత్ర పోషిం చారని, వారి మరణం రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ , వారి కుటుంబ సభ్యులకు శ్రీకాంత్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. **బి.కొత్తకోట :** సిపిఐ అగ్ర నాయకుడు, లోక్‌సభ మాజీ సభ్యులు, సురవరం సుధాకర్ రెడ్డి మరణం పట్ల తంబళ్లపల్లి శాసనసభ్యులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో ముఖ్యంగా వామపక్ష రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారని, వారి మరణంతో దేశం ఒక గొప్ప ప్రజాస్వామిక వాదిని కోల్పోయిందని పేర్కొన్నారు. ప్రజల పక్షాన, వామపక్షాల ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. అటువంటి మహోన్నతమైన వ్యక్తి మృతి చెందడం భాదకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

క్రైం కార్నర్



ప్రమాదంలో బోల్తా పడిన ఇన్నోవా కారు

టైరు పేలి ఇన్నోవా కారు బోల్తా

- ఇద్దరు మృతి.. ఆరుగురికి గాయాలు

- సిఐ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సహాయక చర్యలు

ప్రజాశక్తి - బి.కొత్తకోట/మదనపల్లి అర్బన్



శ్రీనివాసులు, సాయిప్రతాప్ (ఫైల్ ఫొటో)

టమోటా మండిలో పనిచేసుకునే కూలీలు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు బోల్తా కొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. అందులో ప్రయాణిస్తున్న మరో ఆరుగురు గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘ టన శనివారం తెల్లవారుజామున మండలంలని గొల్లపల్లివద్ద జరిగింది. పోలీ సులు కథనం మేరకు వివరాలు.. మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లి వద్ద ఉన్న టమోటా మార్కెట్ యార్డులోని ఎస్‌విఎస్ కమిషన్ మండిలో పట్టణం శివార్లలోని బికెపల్లి కాలనీకి చెందిన శ్రీనివాసులుః(49) అమ్మచెరువు మిట్టకు చెందిన సాయిప్రతాప్(22), పట్టణంలోని దేవళం వీధికి చెందిన నిజాం, మహబూబ్‌బాషా, పఠాన్ ఖాదర్‌ఖాన్, చోటు, మధు, సుహైల్ పనిచేసేవారు. మొలకలచెరువులోని కేజీఎన్ టమోట మండిలో టమోటాలు కొనుగోలు నిమిత్తం శుక్రవారం రాత్రి ఇన్నోవా కారులో వెళ్లారు.అక్కడ టమోటాలను కొనుగోలు చేసి వాటిని లారీలకు లోడ్ చేసి శనివారం ఉదయం 4 గంటల సమయంలో మదనపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలోని గోళ్లపల్లి వద్ద ఇన్నోవా కారు టైరు పేలడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న శ్రీనివాసులు, సాయిప్రతాప్ అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన ఆరుగురు గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో నిజాం, మహబూబ్ బాషా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలి ంచారు. మిగిలిన వారికి ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్సలు అందిస్తు న్నారు. సంఘటన స్థలానికి బి.కొత్తకోట సీఐ గోపాల్ రెడ్డి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం గుర్రంకొండ మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు., మండలంలోని చెర్లోపల్లికి చెందిన శివ భార్య పవిత్ర(26) కుటుంబ సమస్యలపై గొడవపడింది.తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.